# International Lusophone Festival, Goa (December 03-06, 2022)

November 29, 2022

# అంతర్జాతీయ లూసోఫోన్ ఫెస్టివల్, గోవా (డిసెంబర్ 03-06, 2022)

నవంబర్ 29, 2022

భారతీయ సాంస్కృతిక సంబంధాల మండలి (ఐసీసీఆర్), గోవా రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) 2022 డిసెంబర్ 03-06 మధ్య గోవాలో అంతర్జాతీయ లూసోఫోన్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది. లూసోఫోన్ ప్రపంచంతో భారత్ సంబంధాలను మరింత పటిష్టం చేసుకునేందుకు ఈ ఫెస్టివల్ దోహదపడనుంది.

లూసోఫోన్ ప్రపంచంతో గోవాకు చారిత్రకంగా సంబంధాలు ఉన్నాయి. పోర్చుగీసు భాష మరియు సంస్కృతిని భారత్‌లో పెంపొందించే దిశగా కృషి చేసే ఓరియంట్ ఫౌండేషన్ మరియు కామియోజ్ ఇనిస్టిట్యూట్ వంటి పోర్చుగీసు సాంస్కృతిక సంస్థల ద్వారా ఇవి మరింత బలపడ్డాయి. వీటి ఊతంతో సీపీఎల్‌పీ సభ్య దేశాలతో భారత ఆర్థిక, సాంస్కృతిక సహకారం మరియు ప్రజల మధ్య సంబంధాలు మరింత పటిష్టమయ్యాయి.

రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో 2022 డిసెంబర్ 03న అంతర్జాతీయ లూసోఫోన్ ఫెస్టివల్‌ను గోవా ముఖ్య మంత్రి శ్రీ ప్రమోద్ సావంత్ ప్రారంభిస్తారు. విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి మరియు సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి గౌరవనీయ శ్రీమతి మీనాక్షి లేఖి దీనికి గౌరవ అతిథిగా హాజరవుతారు.

ఫెస్టివల్‌లో భాగంగా సీపీఎల్‌పీ దేశాలకు చెందిన సాంస్కృతిక బృందాలు (సుమారు 70 మంది కళాకారులు) గోవాలోని ఈఎస్‌జీ కాంప్లెక్స్, ఆజాద్ మైదాన్, సంస్కృతి భవన్, ఇనిస్టిట్యూట్ మెనెజెస్ బ్రగాంజా తదితర వేదికల్లో ప్రదర్శనలు ఇస్తాయి. అలాగే, ఈ సందర్భంగా కళాకారులు మరియు వాలంటీర్ల కోసం లూసోఫోన్ సంగీతంపై వర్క్‌షాప్‌లు ఉంటాయి. ఇతర వర్క్‌షాప్‌లతో పాటు చారిత్రక రికార్డుల ఫొటోకాపీలు, విశిష్టమైన గోవా ఆర్కిటెక్చర్, గోవా హస్తకళలు, గోవా ఫర్నిచర్ మొదలైన వాటికి సంబంధించిన ప్రదర్శన కూడా ఉంటుంది. అలాగే భారత్ మరియు లూసోఫోన్ ప్రపంచం మధ్య పాకశాస్త్ర సంబంధాలను ప్రతిబింబించేలా లూసోఫోన్ ఫుడ్ అండ్ స్పిరిట్స్ ఫెస్టివల్ కూడా నిర్వహించబడుతుంది.

"ఇండియాస్ అవుట్‌రీచ్ టు ది గ్లోబల్ సౌత్ – ఎక్స్‌ప్లోరింగ్ కన్వర్జెన్స్ విత్ సీపీఎల్‌పీ" మరియు "భారత్-లూసోఫోన్ చారిత్రక మరియు సాంస్కృతిక సంబంధాలు: సింహావలోకనం మరియు అవకాశాలు"

అంశాలపై రౌండ్ టేబుల్ చర్చలు ఉంటాయి. లూసోఫోన్‌తో భారత్‌కు ఉన్న ప్రస్తుత, చారిత్రక సంబంధాలపై సింహావలోకనం చేయడంతో పాటు భవిష్యత్తులో వాటిని మరింత మెరుగుపర్చుకోవడంపై కూడా ఈ సందర్భంగా చర్చిస్తారు.

లూసోఫోన్ కామన్వెల్త్‌గా (Communidade Lusofona) కూడా పేరొందిన ది కమ్యూనిటీ ఆఫ్ పోర్చుగీస్ ల్యాంగ్వేజ్ కంట్రీస్ (Communidade dos Paises de Lingua Portuguesa) ఒక బహుళపక్ష వేదికగా వ్యవహరిస్తోంది. లిస్బన్‌లో జరిగిన 1వ సీపీఎల్‌పీ దేశాలు మరియు ప్రభుత్వాల అధిపతుల సమావేశం సందర్భంగా 1996 జూలై 17న ఇది ఏర్పాటైంది. అంగోలా, బ్రెజిల్, కాబో వర్డీ, గినీ బసావ్, మొజాంబిక్, పోర్చుగల్ మరియు శావో టోమ్ అండ్ ప్రిన్సిప్ దీనికి వ్యవస్థాపక దేశాలుగా వ్యవహరిస్తున్నాయి. టిమోర్ లెస్ట్, ఈక్వెటోరియల్ గినియా తర్వాత చేరాయి. 4 వివిధ ఖండాల్లో విస్తరించిన ఈ 9 లూసోఫోన్ దేశాల్లో దాదాపు 30 కోట్ల జనాభా ఉంటుంది. 2021 జూలైలో అసోసియేట్ అబ్జర్వర్‌గా సీపీఎల్‌పీలో భారత్ చేరింది. సీపీఎల్‌పీతో భారత్ సంబంధాల్లో భాగంగా, సీపీఎల్‌పీలో చేరిన సత్వరమే 2022 మే 05న కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఢిల్లీలో ప్రపంచ పోర్చుగీస్ భాషా దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంలో భాగంగానే ఈ ఫెస్టివల్ నిర్వహించబడుతోంది.

**న్యూఢిల్లీ**

**నవంబర్ 29, 2022**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA’s website and may be referred to as the official press release.